ముందుకు సాగని రబీ

- అన్నదాతకు దక్కని భరోసా
- అరకొరగా పంటల సాగు
- అప్పులు చేసి పంట సాగుచేయలేమంటున్న రైతులు

తనకల్లు: మండలంలో ఈ ఏడాది రబీసాగు ప్రశ్నార్థకంగా మారింది. ఏటా రబీ సీజన్‌లో వివిధ పంటల సాగు రైతులు ఎంతో ఆసక్తి చూపేవారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం హయాంలో రైతులకు అండగా నిలిచి అనేక రకాలుగా ప్రోత్సహించేవారు. వ్యవసాయం, రైతుల సంక్షేమం కోసం ప్రత్యేకంగా ఆర్‌బీకేలను నిర్మించి అన్ని రకాల సేవలను అందించారు. అయితే కూటమి ప్రభుత్వం ఆర్బీకేలను నిర్వీర్యం చేసింది. రైతులకు చేయూత కరువైంది. దీంతో రబీ సీజన్‌లో పంటల సాగుకు రైతులు ముందుకురావడం లేదు. ఫలితంగా ఈ ఏడాది రబీలో సాధారణ సాగు విస్తీర్ణానికి నోచుకోలేదు.


కొక్కంటి వద్ద సాగులో ఉన్న వరి పంట

179 హెక్టార్లలో మాత్రమే సాగు

మండలంలో రబీ సీజన్‌లో వేరుశనగ, వరి, టమాట, ఉలవ, మొక్కజొన్న, అలసంద, అనప, ఇతర కూరగాయాలను సాగు చేస్తారు. మండల రబీ సీజన్ సాగు సాధారణ విస్తీర్ణం 1,430 హెక్టార్లు. అయితే ఇప్పటి వరకు నామామాత్రంగా సాగు చేశారు. మండల వ్యాప్తంగా కేవలం 179 హెక్టార్లలో మాత్రమే రబీ పంటలను రైతులు సాగు చేసినట్లు వ్యవసాయాధికారులు చెబుతున్నారు.

రైతులకు అందని పెట్టుబడి సాయం

ప్రస్తుతం రైతులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. దీంతో రబీలో రైతులకు పెట్టుబడి సమస్య కూడా అధికమైంది. గత ప్రభుత్వంలో వైఎస్సార్ రైతు భరోసా కింద ఏటా రూ. 13,500 క్రమం తప్పకుండా రైతుల ఖాతాల్లో జమ చేసేవారు. అంతే కాకుండా సరసమైన ధరలకు ఆర్బీకేల ద్వారా రైతులకు ఎరువులు, నాణ్యమైన విత్తనాలు అందేవి. అయితే ప్రస్తుతం ఆఎస్‌కేల్లో అందాల్సిన సేవలు దాదాపుగా నిలిచిపోయాయని రైతులంటున్నారు. అరకొర ఎరువులు మాత్రమే అందుబాటులో ఉంచారని వారు తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే అన్నదాత సుఖీభవ కింద రూ.20 వేలు చొప్పున పెట్టుబడి సాయం అందిస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారని, అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 6 నెలలు కావొస్తున్నా ఇంతవరకు తమకు ఎలాంటి సాయం అందలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అప్పులు చేసి పంటలు పెట్టాలి



అప్పులు చేసి పంటలు సాగు చేయాలంటే చాలా కష్టంగా ఉంది. పెట్టుబడి సాయం అందక ఇబ్బంది పడుతున్నాం. ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం లేదు. చాలా మంది అప్పులు చేసి పంటలు సాగుచేసే పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం స్పందించి పెట్టుబడి సాయం అందించాలి.

– నాగభూషణరెడ్డి, రైతు, చీకటిమానిపల్లి, తనకల్లు

రైతులను మోసగించడం దారుణం



గత ప్రభుత్వం ఏటా రైతులకు క్రమంగా రైతు భరోసా కింద రూ. 13,500 ఇచ్చింది. కూటమి ప్రభుత్వం వచ్చి రైతులను దారుణంగా మోసగించింది. చంద్రబాబు ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం ప్రతి రైతుకు రూ.20 వేల చొప్పున అకౌంట్లో జమ చేయాలి. లేకుంటే రైతులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడుతాం.

– శివన్న, రైతు సంఘం నాయకుడు, తనకల్లు

సాగు విస్తీర్ణం పెంపునకు చర్యలు



రబీలో పంటల సాగు విస్తీర్ణం పెంచడానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నాం. ప్రభుత్వం కూడా రైతులను అన్ని విధాలుగా ప్రోత్సహిస్తోంది. రాయితీపై ఉలవలను పంపిణీ చేసాం. సాధారణ విస్తీర్ణంలో పంటలు సాగయ్యే విధంగా రైతులను సిద్ధం చేస్తాం.

– శ్రీహరినాయక్, ఏఓ, తనకల్లు

క్లుప్తంగా

క్రీడల్లో 'యశోద' విద్యార్థుల ప్రతిభ


క్రీడాకారులను అభినందిస్తున్న పాఠశాల ప్రిన్సిపాల్ అనూప్

ధర్మవరం: క్రీడల్లో యశోద పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటినట్లు పాఠశాల డైరెక్టర్ పృథ్వీరాజ్, ప్రిన్సిపాల్ అనూప్ తెలిపారు. పాఠశాలలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రతిభ చూపిన క్రీడాకారులను అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 25,26 తేదీల్లో విశాఖపట్నంలో జరిగిన ఎస్‌జీఎఫ్ఐ త్రోబాల్ అండర్–19 విభాగంలో పాఠశాల విద్యార్థులు కార్తీక్‌నాయక్, వినీత్‌రెడ్డి, అశ్విన్, వెంకటేషులు, దాత్రిరెడ్డి, సాయిస్వేత, తన్మయి ప్రతిభ చూపి బాలికలు మొదటిస్థానంలో, బాలురు మూడోస్థానంలో నిలిచారన్నారు. భవిష్యత్తులో మరెన్నో పతకాలు సాధించాలని వారు ఆకాంక్షించారు.

పకడ్బందీగా సాగునీటి సంఘాల ఎన్నికలు


మాట్లాడుతున్న ఆర్డీఓ వీవీఎస్ శర్మ

కదిరి అర్బన్: ఈ నెల 8న సాగునీటి సంఘాల ఎన్నికలు పకడ్బందీగా నిర్వహిద్దామని రెవిన్యూ డివిజనల్ ఆఫీసర్ వీవీఎస్ శర్మ సిబ్బందికి సూచించారు. శనివారం ఆయన తన కార్యాలయంలో సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణపై ఎన్నికల అధికారులు, సహాయ ఎన్నికల అధికారులకు ఒక రోజు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓతో పాటు జిల్లా మాస్టర్ ట్రైనీ, ఉప కార్యనిర్వాహక ఇంజనీర్ గంగాద్రి మాట్లాడారు. డివిజన్ స్థాయిలో మైనర్ ఇరిగేషన్ కింద 18 సంఘాలు ఉన్నాయన్నారు. డిసెంబర్ 5న నోటిఫికేషన్ విడుదల అవుతుందన్నారు. 8న ఎన్నికలు ఉంటాయని చెప్పారు. ఎన్నికల నిర్వహణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. సమన్వయంతో పనిచేసి ఎన్నికలు ప్రశాంతమైన వాతావరణంలో నిర్వహించాలన్నారు. సమావేశంలో ఇరిగేషన్ ఏఈఈలు, ఏఈలు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

'రూపరాజా'లో ఘనంగా గ్రీన్ డే



పండ్లు, పూల వేషధారణలో విద్యార్థులు

ధర్మవరం: ధర్మవరం మండలం నాగలూరు వద్దనున్న రూపరాజా పీసీఎంఆర్ పాఠశాలలో శనివారం ఘనంగా గ్రీన్‌డే నిర్వహించారు. పాఠశాల చైర్మన్ హర్షవర్ధన్ విద్యార్థులతో కలిసి చెట్లు నాటారు. విద్యార్థులంతా ఆకుపచ్చ రంగు దుస్తులతో అలరించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ సకల జీవరాశులు మానవజాతి సుఖంగా బతకాలంటే ప్రకృతి సమతుల్యతను కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. పొల్యూషన్, గ్లోబల్ వార్మింగ్ తగ్గించేందుకు ఇప్పటికైనా ఆక్సిజన్ ఎక్కువ ఉత్పత్తి చేసే చెట్లను ప్రతి ఒక్కరూ విరివిగా పెంచాలని, లేకపోతే మానవజాతి మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుందన్నారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు రూపరాజాకృష్ణ, జగదీష్, కరస్పాండెంట్ నాగమోహన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ నరేష్ కుమార్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అయ్యప్ప మాలధారులకు అన్నదానం


మాలధారులకు అన్నదానం చేస్తున్న దాత చంద్ర కుటుంబీకులు

బత్తలపల్లి: మండల కేంద్రంలోని అయ్యప్ప స్వామి ఆలయంలో శనివారం అన్నదాన కార్యక్రమాన్ని అన్నదాతలు జాస్తి గోబి చంద్ర, చంద్రకళ, మేఘన, అమూల్య ప్రారంభించారు. ముందుగా ఆలయంలో గురుస్వామి శెట్టిప్పస్వామి గణపతి పూజ, అయ్యప్ప పూజ, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అయ్యప్పలకు భిక్ష ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అయ్యప్ప సేవా సంఘం కమిటీ సభ్యుడు జక్కంపూటి పురుషోత్తంచౌదరి మాట్లాడుతూ నేటి నుంచి నెల రోజులు పాటు అయ్యప్ప ఆలయంలో మధ్యాహ్నం భిక్ష కొనసాగుతుందన్నారు. అయ్యప్ప సేవా సంఘం సభ్యులు వడ్డే బొజ్జప్ప, గోగుల కాటమయ్య, అక్కిం ప్రతాప్, బోయపాటి అప్పస్వామి, బొమ్మినేని రాము, తొట్లు వేణు, కుమ్మర శివయ్య, ఫోటో స్టూడియో మహేష్, ఐచర్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

వడ్డెర్లను ఎస్టీ జాబితాలో చేర్చాలి

తనకల్లు: వడ్డెర్లను ఎస్టీ జాబితాలో చేర్చాలని వడ్డెర సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు వల్లపు ఉత్తన్న అన్నారు. మండల కేంద్రంలోని చౌడేశ్వరీ దేవి ఆలయంలో వడ్డెర సంక్షేమ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు కుంచెపు గంగరాజు ఆధ్వర్యంలో శనివారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వడ్డెర్లను అన్ని రాజకీయ పార్టీలు కేవలం ఓటు బ్యాంకుగానే చూడడం తగదన్నారు. వడ్డెర్లను రాజకీయాల్లోనూ రిజర్వేషన్లను కల్పించాలన్నారు. వడ్డెర కార్పొరేషన్‌కు వెంటనే చైర్మెన్ నియమించాలని కోరారు. ప్రతి మండలంలోనూ వడ్డెర్ల కల్యాణమండపాలను నిర్మించనున్నట్లు తెలిపారు. అనంతరం వడ్డెర సంక్షేమ సంఘం మండల నూతన కమిటీ ఎన్నిక జరిగింది. మండలాధ్యక్షుడిగా ఈతోడు కిష్టప్ప, మహిళా అధ్యక్షురాలిగా హిమగిరిజ, గౌరవ ఉపాధ్యక్షుడిగా శ్రీనివాసులు, జనరల్ సెక్రటరీగా రవి, మహిళా గౌరవాధ్యక్షురాలిగా రమణమ్మను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నాయకులు ఉత్తన్న, శ్రీరాములు, గంగరాజు, లక్ష్మీదేవి, నాగార్జున, బాబు, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.


ఏకగ్రీవంగా ఎన్నికైన మండల కమిటీ సభ్యులు

ఎస్సీ, ఎస్టీ చట్టాన్ని దుర్వినియోగం చేయొద్దు

బత్తలపల్లి: ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని దుర్వినియోగ చేయొద్దని బత్తలపల్లి డిప్యూటీ తహసీల్దార్ షణ్ముఖకుమార్ యాదవ్ సూచించారు. శనివారం ఈదుల ముష్టూరులోని నేతాజీ సుభాష్ చంద్రబోస్ కాలనీలో సివిల్ రైట్స్ డేలో భాగంగా ప్రజల హక్కులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డీటీ మాట్లాడుతూ గ్రామాల్లో ఎస్సీ, ఎస్టీలు అన్యాయానికి గురై ఉంటే పోలీసులను ఆశ్రయిస్తే న్యాయం చేస్తారన్నారు. ఇప్పటికీ గ్రామాల్లో ఎవరైనా వెట్టి చాకిరీ, దౌర్జన్యాలు, బాలకార్మికులను వేధించడం లాంటివి చేస్తే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ప్రజలందరూ ఒక్కటేనని, అందరూ కలిసి మెలిసి జీవించాలన్నారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను వారి దృష్టికి తీసుకురాగా పరిష్కరిస్తామన్నారు. వీఆర్‌ఓ ముత్యాలన్న, కార్యదర్శి శ్రీనివాసులు, పోలీసులు జనార్ధన్, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

ముదిగుబ్బ: చట్టాలపై అవగాహన పెంచుకోవాలని ముదిగుబ్బ యూపీఎస్ సీఐ శివరాముడు ఉప్పలపాడు ఎస్సీ కాలనీవాసులకు సూచించారు. శనివారం కాలనీలో సివిల్ రైట్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ నారాయణస్వామి, సీఐ శివరాముడు హాజరై మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీలపై దాడులు జరిగితే చట్టం వారికి అండగా ఉంటుందన్నారు. ఈ సందర్భంగా చట్టాలు, హక్కులు తదితర వాటి గురించి కాలనీ వాసులకు అవగాహన కల్పించారు.


మాట్లాడుతున్న డిప్యూటీ తహసీల్దార్ షణ్ముఖకుమార్

ఉపాధి నిధులు దుర్వినియోగం కాకూడదు

తాడిమర్రి: జిల్లాలో కూలీలకు పనులు కల్పించడానికి ఏర్పాటు చేసిన ఉపాధి హామీ నిధులను దుర్వినియోగం కాకూడదని డ్వామా పీడీ విజయేంద్ర ప్రసాద్ పేర్కొన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం జరిగిన సామాజిక తనిఖీ బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. ఉపాధిహామీ పనులు కల్పన, బిల్లుల చెల్లింపులో అంకిత భావంతో పని చేయాలని ఆయన సిబ్బంది సూచించారు. ఈ సందర్భంగా డీఆర్పీలు బహిరంగ సభలో సామాజిక తనిఖీ వివరాలు వెల్లడించారు. 2023–24లో 703 పనులకు రూ.6,92,31,843 ఖర్చు చేశారని, ఇందులో రూ.68,693 దుర్వినియోగం అయినట్లు తెలిపారు. ఉపాధి హామీలో రూ.57,026, పంచాయతీ రాజ్ శాఖలో రూ.11,667 నిధులు దుర్వినియోగమైనట్లు పేర్కొన్నారు. ప్రిసైడింగ్ అధికారి కే.విజయేంద్ర ప్రసాద్ బాధ్యుల ఉంచి నిధులను రికవరీ చేయాలని సిబ్బందిని ఆదేశించారు. జిల్లా విజిలెన్స్ అధికారి రమణారెడ్డి, ఏపీడీ వెంకటాచలపతి, అంబుడ్స్‌మెన్ శివశంకర్‌రెడ్డి, ఎంపీడీఓ వెంకట రంగారావు, ఏపీఓ సంజీవరెడ్డి, ఎస్సార్పీ తిరుమలేష్, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డ్వామా పీడీ విజయేంద్రప్రసాద్

విద్యార్థులు నైపుణ్యాలను పెంచుకోవాలి

ఎన్పీకుంట: నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులు నైపుణ్యాలను పెంచుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం శిరీషారెడ్డి పేర్కొన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వృత్తి విద్యా నైపుణ్యాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రతి విద్యార్థి వృత్తి విద్యపై ఆశక్తి పెంచుకోవాలన్నారు. అనంతరం పారిశ్రామిక సందర్శనలో భాగంగా విద్యార్థులతో స్థానిక ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకును సందర్శించారు. పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ

పుట్టపర్తి: బుక్కపట్నం, కొత్తచెరువు మండలాల్లోని పలు గ్రామాల్లో శనివారం ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి సామాజిక భద్రతా పింఛన్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆదివారం సెలవు రోజు కావడంతో ఒక రోజు ముందుగా పింఛన్లు పంపిణీ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బత్తలపల్లి: మండలంలో శనివారం పింఛన్ల పంపిణీ సజావుగా సాగింది. మండలవ్యాప్తంగా 6,274 మంది పింఛన్‌దారులుండగా సాయంత్రం 6 గంటలకు 5,983 మందికి పంపిణీ చేసి 96 శాతం పింఛన్ల పంపిణీ పూర్తి కాగా సాయంత్రం 7గంటల వరకు పంపిణీ ఉంటుందని మరింత శాతం పెరగవచ్చునని అధికారులు తెలిపారు.

కనగానపల్లి: మండలంలో తొలిరోజు 90 శాతంపైగా సామాజిక పింఛన్లు పంపిణీ చేసినట్లు ఎంపీడీఓ అనిల్‌కుమార్ తెలిపారు. శనివారం మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో అధికారులు సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. మండలంలో 6,135 పింఛన్లు ఉండగా అందులో 5,500 మంది లబ్ధిదారులకు సచివాలయ సిబ్బంది పింఛన్ సొమ్ము అందజేశారు. కోనాపురం, భానుకోట తదితర గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులైన తమకు పింఛన్ అందలేదని లబ్ధిదారులు తెలిపారు.


పింఛన్ సొమ్ము అందిస్తున్న ఎమ్మెల్యే సింధూరరెడ్డి

దివ్యాంగులకు వైద్య శిబిరం


పిల్లల తల్లిదండ్రులకు సలహాలు ఇస్తున్న జడ్జి జయలక్ష్మి

కదిరి టౌన్: జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు భవిత కేంద్రంలోని దివ్యాంగ పిల్లలకు శనివారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు సీనియర్ సివిల్ జడ్జి ఎస్.జయలక్ష్మి తెలిపారు. కదిరి ఏరియా హాస్పిటల్ డాక్టర్లు హారిక, లక్ష్మీరాం, తిరుమలేష్ పిల్లలకు అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం పిల్లల తల్లిదండ్రులకు సలహాలు,సూచనలు తెలియజేశారు. కార్యక్రమంలో న్యాయవాదుల సంఘం అధ్యక్షులు నాగేంద్రరెడ్డి, ఎంఈఓ ఓబులరెడ్డి, భవిత కేంద్రం ప్రధానోపాధ్యాయుడు వెంకటాచలం, టీచర్ సౌజన్య, అన్వేష్ తదితరులు పాల్గొన్నారు.


వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి గీతావాణి

ఎల్‌సీకేపురంలో వైద్యశిబిరం

ధర్మవరం రూరల్: ఎల్‌సీకేపురంలోని భవిత సెంటర్, అప్పర్ ప్రైమరీ పాఠశాలలో శనివారం న్యాయ విజ్ఞాన సదస్సుతో పాటు మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఏపీ న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు కార్యక్రమం జరిగింది. ధర్మవరం సీనియర్ సివిల్ జడ్జి ఎ.గీతావాణి మాట్లాడుతూ నేత్రదానం చేసి మరొకరికి చూపును ప్రసాదించాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు వాసుదేవ రెడ్డి, ఉరుకుందప్ప, చంద్రిక, లలిత, ఎంఈఓ రాజేశ్వరి, న్యాయవాది బాలసుందరి, శారద, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

సోషల్ మీడియాపై అప్రమత్తంగా ఉండాలి

ధర్మవరం అర్బన్ : సోషల్ మీడియా దుర్వినియోగంపై యువత అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. స్థానిక కేహెచ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం సోషల్ మీడియా దుర్వినియోగం, సైబర్ బెదిరింపులు అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రిన్సిపాల్‌తోపాటు కళ్యాణదుర్గం ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకుడు శ్యాంప్రసాద్ మాట్లాడారు. సోషల్ మీడియాలో ఇబ్బందికర పోస్టులు, మాటలు, ఫొటోలు, వీడియోలు ఇతరులకు పెట్టడం, వ్యక్తిగత సమాచారాన్ని దొంగలించడం నేరాలుగా పరిగణించి పోలీసులు కేసులు నమోదు చేస్తున్నారన్నారు. సైబర్ క్రైంను అరికట్టడానికి కమాండోలు, సైబర్ సోల్జర్స్‌కు శిక్షణనిచ్చి నియమించారని తెలిపారు. ఓటీపీ, బ్యాంకు ఖాతా వివరాలు చెప్పాలని ఫోన్లు చేస్తే ఎవరూ చెప్పకూడదన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు గోపాల్‌నాయక్, పావని, త్రివేణి, చిట్టెమ్మ, భువనేశ్వరి, కిరణ్‌కుమార్, సరస్వతి, పుష్పవతి, మీనా, ఆనంద్, హైమావతి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కళాశాల ప్రిన్సిపాల్ ప్రభాకర్‌రెడ్డి

వెబ్ డెవలపర్ కోర్సులో ఉచిత శిక్షణ

కదిరి అర్బన్: స్థానిక ఎస్టీఎస్ఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్ ఆధ్వర్యంలో డిగ్రీ పూర్తి చేసిన యువతీయువకులకు వెబ్ డెవలపర్ కోర్సులో ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నారు. ఈమేరకు కళాశాల ప్రిన్సిపాల్ డా. స్మిత, జిల్లా నైపుణ్యాధికారి హరిక్రిష్ణ శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. 3 నెలల పాటు శిక్షణ ఉంటుందని తెలిపారు. స్కిల్ హబ్ కో ఆర్డినేటర్ నాగార్జున(సెల్: 9390176421)ను సంప్రదించాలని కోరారు.

ప్రకృతి వ్యవసాయం లాభదాయకం

తలుపుల : ప్రకృతి వ్యవసాయం లాభదాయకమని హైదరాబాద్ ప్రకృతి వ్యవసాయ నిపుణులు రాంప్రసాద్, రవితేజ అన్నారు. బి.కొత్తపల్లి, ఏపులపల్లి, సిద్దుగూరిపల్లి గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పండిస్తున్న పంటలను శనివారం సీఎస్ఏ రాష్ట్ర కోఆర్డినేటర్ ఆదినారాయణ ఆధ్వర్యంలో వారు పరిశీలించారు. అనంతరం ఘన జీవామృతం, ద్రవ జీవామృతం, పంచగవ్య తయారీ, వినియోగంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీఎస్ఏ సిబ్బంది రమణ, ఎన్ఎస్‌పీ శ్యామల, సీఆర్పీలు రమణ, మునేసులు, సుజిత,పుష్ప, లక్ష్మీదేవి, గంగులమ్మ, గీతమ్మ పాల్గొన్నారు.

ఎయిడ్స్ దినోత్సవం

కదిరి అర్బన్: స్థానిక ఎస్టీఎస్ఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం ఎన్ఎస్ఎస్ యూనిట్ 1,2 ఆధ్వర్యంలో ఎయిడ్స్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎయిడ్స్ వ్యాధి లక్షణాలు, నివారణ చర్యలను కళాశాల ప్రిన్సిపాల్ డా.స్మిత, జువాలజీ లెక్చరర్ క్రిష్ణానాయక్ విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బీసీ సంక్షేమ సంఘం జిల్లా కమిటీలో చోటు

బత్తలపల్లి: బీసీ సంక్షేమ సంఘం శ్రీసత్యసాయి జిల్లా కమిటీలో మండల వాసులకు చోటు లభించింది. శుక్రవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసిన శంకర్రావు అధ్యక్షతన విజయవాడలో శ్రీసత్యసాయి జిల్లా కమిటీని ఎంపిక చేశారు. ఇందులో మండలానికి చెందిన వడ్డే పూజారి తిరుపతయ్యను జిల్లా ఉపాధ్యక్షునిగా, బాపనపల్లి వెంకటరమణ జిల్లా సహాయ కార్యదర్శిగా ఎంపిక చేసినట్లు వారు పేర్కొన్నారు.

గుండెపోటుతో వైఎస్సార్‌సీపీ నాయకుడి మృతి

రామగిరి: మండలంలోని చెర్లోపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు రామకృష్ణారెడ్డి (49) శనివారం రాత్రి గుండెపోటుతో మృతి చెందాడు. వివరాలు.. రామకృష్ణారెడ్డి తనకున్న పొలంలో పంటలు సాగు చేసుకుంటూ.. కోళ్లఫాం నిర్వహిస్తున్నాడు. అప్పుల బాధ అధికం కావడంతో రాత్రి ఒక్కసారిగా ఇంటిలో కుప్పకూలి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య సువర్ణమ్మ, కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం ఆకస్మిక తనిఖీ


రికార్డులను పరిశీలిస్తున్న నోడల్ ఆధికారి వీరమ్మ

తనకల్లు: కొక్కంటిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని నోడల్ అధికారి, పోగ్రాం ఆఫీసర్ వీరమ్మ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుత్రిలోని పలు రికార్డులు, రిజిస్టర్లను పరిశీలించారు. ఆరోగ్య కేంద్రంలో జరుగుతున్న కాన్పుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రికి వచ్చే రోగులు, బాలింతలు, చిన్నారులకు అందిస్తున్న వైద్య సేవలపై ఆరా తీశారు. మారిన వాతావరణ పరిస్థితుల కారణంగా జ్వరాలు తదితర వ్యాధులు వచ్చే అవకాశం అధికంగా ఉందని, ఆరోగ్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆరోగ్య కేంద్రంలో ఏవైనా మందుల కొరత ఉంటే వెంటనే పై అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారి లోకేశ్వర్‌రెడ్డి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

కవితోత్సవాన్ని జయప్రదం చేయండి


ప్రశంసాపత్రాలను ఆవిష్కరిస్తున్న స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు

ధర్మవరం రూరల్: ధర్మవరంలో ఆదివారం జరగనున్న కవితోత్సవాన్ని జయప్రదం చేయాలని జిల్లా రచయితల సంఘం నాయకులు కోరారు. శనివారం స్థానిక పోలా ఫంక్షన్ హాల్‌లో సమావేశం నిర్వహించారు. యువర్స్ ఫౌండేషన్, సోమలరాజు ఫౌండేషన్, రోటరీ క్లబ్, రెడ్‌క్రాస్, మెహర్‌బాబా తదితర స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కవితోత్సవానికి సంబంధించిన ఆహ్వాన పత్రికతో పాటు ప్రశంసాపత్రం ఆవిష్కరించారు. అనంతరం వృద్ధులకు దుప్పట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు సోమలరాజు శివరాజు, పోలా ప్రభాకర్ చౌదరి, శీలా నాగేంద్ర, నరేందర్‌రెడ్డి, మెహర్ సుజాత తదితరులు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్


పేకాటరాయుళ్లను అరెస్ట్ చేసిన పోలీసులు

తనకల్లు: మండలంలోని బిసినివారిపల్లి వద్ద పేకాట ఆడుతున్న తొమ్మిది మందిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ గోపి శనివారం తెలిపారు. వివరాలు...గ్రామ సమీపంలో కొందరు వ్యక్తులు పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందుకున్న ఎస్ఐ తన సిబ్బందితో కలిసి వారిని పట్టుకున్నారు. పేకాటరాయుళ్ల నుంచి రూ.10,150 నగదు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. కార్యక్రమంలో జమేదార్ గౌడ, సిబ్బంది పాల్గొన్నారు.



సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
ధర్మవరం డివిజన్
9912220717, 9912220727,
9912220726, 9010593486